



మాట్లాడుతున్న చన్నబసప్ప

కన్నడ అభివృద్ధికి కట్టుబడాలి
● నాడోజ చన్నబసప్ప
● అట్టహాసంగా కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనం

8



రామయ్యా..ఇస్తావయ్యా..!

● అందరి చూపు సిద్దూ బడ్జెట్‌వైపే.. ● ఎవరికి వరాలో.. ఎవరిపై పన్నులో..?
● రూ.4లక్షల కోట్లతో అంచనా ● వనరులు సమకూర్చుకోవడమే సవాల్
● రికార్డు స్థాయిలో 16వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ముఖ్యమంత్రి

బెంగళూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కాంగ్రెస్ పాలన... ఐదు గ్యారెంటీలతో ఆర్థికంపై పెనుభారం వంటి పరిణామాల నేపథ్యంలోనే సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టే బడ్జెట్‌పైనే రాష్ట్రప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఎవరికి ఎలాంటి వరాలు ఇస్తారోనని అన్ని వర్గాలు ఎదురు చూస్తున్నారు. సీఎం సిద్దరామయ్యకు ఇదో రికార్డు కానుంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కాని రీతిలో 16వ బడ్జెట్‌ను శుక్రవారం ఆర్థికమంత్రి హోదాలో సీఎం ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రంలో రామకృష్ణహెగ్డే 13సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఉంది. గత ఏడాది లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ ప్రవేశపెట్టిన సిద్దూ ప్రస్తుతం వాస్తవంతోపాటు సమతుల్యమైన బడ్జెట్ ప్రవేశపెట్టవచ్చని భావిస్తున్నారు. ఓవైపు గ్యారెంటీల భారం, మరోవైపు భారీ ప్రాజెక్టులకు గ్రాంట్ల కొరతతోపాటు రెవెన్యూలోటు మధ్య ఆర్థికక్రమశిక్షణ కాపాడేలాంటి బడ్జెట్ రానుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 3.71 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిన సిద్దరామయ్య ప్రణాళికా ఖర్చు 2.90 లక్షల కోట్లకు పైగా ఉంది. పెట్టుబడుల ఖర్చు రూ.55వేల కోట్లకు తగ్గింది. కేంద్రప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా జీఎస్టీ పంపిణీ కొరత రాష్ట్రంలో ఆదాయంపైనా ప్రభావం చూపింది. దీనికితోడు పలు పథకాలకు పెట్టుబడులు సాధించుకోవడం సవాల్‌గా మారింది. కేంద్రం నుంచి ఆశించినంత ప్రత్యేక గ్రాంట్లు ఆచూకీ లేకుండా పోయాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆదాయమూలాలు, నిధుల మిగులు చూసి కొత్త పథకాలను ప్రకటించే అవకాశం ఉంది. ప్రధానంగా ఆర్థిక క్రమశిక్షణలో పేరొందిన సిద్దరామయ్య బడ్జెట్ గాత్రాన్ని పెంచి అందుకు అనుగుణంగా రుణాలు పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

గ్యారెంటీల అమలే ప్రధానం

గత ఏడాది 1,05,246 కోట్ల రూపాయలు అప్పులు చేయాలని అంచనా వేసిన సిద్దరామయ్య ఈ ఏడాది బడ్జెట్ గాత్రాన్ని పెంచుకుని 1.25 లక్షల కోట్లదాకా పరిమితిని పెంచుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. సహజంగా వడ్డీ చెల్లింపులు కూడా 45వేల కోట్లకు పెరిగే అవకాశం ఉంది. వీటితోపాటు 5 గ్యారెంటీల భారాన్ని అంతసులభంగా తగ్గించడం అనేది సాధ్యం కాదని చెప్పవచ్చు. నిబంధనల పేరిట ఏ పథకంలోనైనా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలని భావిస్తే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడిన విషయం తెలిసిందే. దీన్నిబట్టి గ్యారెంటీలకు కష్టమైనా కొనసాగించాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్యారెంటీలను ఆపకుండా పాలించాలని భావిస్తున్నారు. ఉన్నఫళంగా గ్యారెంటీలపై వేటు వేయకుండా, ఆదాయాన్ని క్రోడీకరించుకోవాలని భావిస్తున్నారు. ఈ ఏడాది పన్నుల రూపంలో 2లక్షల కోట్లదాకా పెంచుకోవాలని భావిస్తున్నారు. ఇదే నిర్ణయంలో ఉంటే చిన్నతరహా పన్నులపైనా దృష్టి సారించినట్లు అవుతుంది. గత ఏడాది అబ్కారీపై రెండుసార్లు పన్నులు విధించడంతో రానున్న బడ్జెట్‌లో ఆ శాఖకు వెసలుబాటు ఇచ్చే అవకాశం ఉంది. బిడది టౌన్‌షిప్, నెలమంగల వద్ద క్విన్‌సిటీ ప్రాజెక్టులకోసం రైతులనుంచి భూమిని కొనుగులో చేసి వారికి పరిహారం చెల్లించడంతోపాటు అభివృద్ధి చేసిన ప్రదేశాన్ని ప్రైవేట్‌గా కేటాయించి ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్రంలోని భారీ ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిన అమలు చేయదలిచారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టనున్నారు.

సిద్దూ ప్రవేశ పెట్టిన బడ్జెట్ వివరాలు (రూ.కోట్లలో..)

ఏడాది	గాత్రం	రుణం
1995-1996	10,859	1,309
1996-97	12,399	1,404
1997-98	13,456	1,610
1998-99	15,579	1,847
1999-2000	17,818	3,173
2004-05	31,591	3,910
2005-06	34,615	4,475
2013-14	1,21,611	18,801
2014-15	1,38,008	20,632
2015-16	1,42,534	19,676
2016-17	1,63,419	31,036
2017-18	1,86,561	37,092
2018-19	2,09,181	39,328
2023-24	3,27,747	85,818
2024-25	3,71,383	1,05,246

వనరులే సవాలు..

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలతోపాటు ప్రాజెక్టులు ఇతరత్రా అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూర్చుకోవడం సవాల్‌గా మారుతోంది. ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థికత సాధించే అంశాన్ని ప్రస్తావిస్తూ పన్నులు పెంచే ఆలోచనలో ఉన్నారు. ఐదు గ్యారెంటీలకు ఏడాదికి 50వేలకోట్లు రూపాయలు అవసరంగా భావిస్తున్నారు. భారీ పరిశ్రమలు ఇతరత్రా రంగాలపై పన్నులు పెంచే ఆలోచన ఉంది. మద్యం ధర పెంచాలనే ఆలోచన కంటే గ్రామీణ ప్రాంతాల్లోనూ చిన్న పట్టణాల్లోనూ కొత్తగా మద్యం దుకాణాలకు లైసెన్సులు ఇవ్వనున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ, నగర పాలికె, మహానగర పాలికెలలో ఆస్తిపన్ను పెంచనున్నారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయి టోల్‌గేట్ ఏర్పాటు చేయదలిచారు. ఐటీబీటీ రంగాల నుంచి సీఎస్ఆర్ నిధి ప్రమాణం పెంచేందుకు సిఫారసు చేసేందుకు అవకాశం ఉంది. దీంతోపాటు రైతు వ్యతిరేక చట్టాలను రాష్ట్రంలో అమలు చేయడం లేదని బడ్జెట్ ద్వారా వివరించదలిచారు. విద్యుత్‌రంగంలో ప్రైవేటీకరణ ప్రయత్నాలు వదులుకోదలిచారు. కర్ణాటక పంటల ధరల కమిషన్‌కు చట్టపరమైన వెసలుబాటు కల్పించదలిచారు. భూమాఫియాదందాను అరికట్టేందుకు భూసంస్కరణల చట్టంలో సవరణలు, ప్రణాళికలు ప్రకటించినట్లు గోవధ నిషేధచట్టం వాపసు తీసుకునే ప్రస్తావన చేయనున్నట్లు తెలుస్తోంది. సిద్దరామయ్య ఆర్థికమంత్రిగా, ఉపముఖ్యమంత్రిగానే కాకుండా ముఖ్యమంత్రిగాను బడ్జెట్‌లు ప్రవేశపెట్టారు. దేశంలో అత్యధికసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు ఇటీవల రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించిన వాజుభాయ్‌వాలాదే. గుజరాత్‌లో ఆయన 18సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాతిస్థానంలో సిద్దరామయ్య 16వ బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. ఇక రాష్ట్రపరిధిలో పరిశీలిస్తే రామకృష్ణహెగ్డే 13సార్లు, యడియూరప్ప 8సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు.



ఆదాయ మూలాలు	2024 లక్ష్యం	ఇప్పటిదాకా సాధ్యం
వాణిజ్యపన్నులు	1.10 లక్షల కోట్లు	84,700 కోట్లు
స్టాంపులు రిజిస్ట్రేషన్	26వేల కోట్లు	18వేల కోట్లు
అబ్కారీ	38,525 కోట్లు	29,371 కోట్లు
రవాణాశాఖ	13వేలు కోట్లు	11,585 కోట్లు



గతేడాది బడ్జెట్ పత్రాలతో సభలోకి ప్రవేశిస్తున్న సీఎం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోవిందా.. గోవిందా..

● వైభవంగా వెంకటరమణ స్వామి రథోత్సవం

మహదేవపుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్లిలో కొలువైన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. శ్రీకంఠేశ్వర, పంచముఖి ఆంజనేయస్వామి, ద్రౌపదమ్మ ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అరవింద లింబావళి కుస్తీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాలైన హగదూరు, వైట్‌ఫీల్డ్, చన్నసంద్ర, వర్తూరు, గుంజూరు, హూడి, నల్లూరహళ్ళి, నాగొండనహళ్ళి, కాడుగూడి సహా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిమంది పాల్గొన్నారు. ఉత్సవంలో వీరగాసె, డొళ్ళుకుణిత, తమటె, పూజాకుణిత, నాదస్వర, మైసూరు నగారి, నందిధ్వజ కుణిత, కీలుగుర్రాలు, వీరగాసె, గారడీబొమ్మలు, డొళ్ళుకుణిత సహా వివిధ కళాకారుల బృందాలు సందడి చేశాయి. ప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గంలో బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, హూడి పిళ్లప్ప, ముఖ్యులు ఎల్ రాజేశ్, శ్రీధర్, మోది, మధు తదితరులు పాల్గొన్నారు.



కుస్తీ పోటీల ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి లింబావళి

అధికారులపై లోకాయుక్త దాడి

● పలు జిల్లాల్లో ఏకకాలంలో 8మందిపై.. ● భారీగా బంగారం, నగదు, ఆస్తిపత్రాల స్వాధీనం

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అధికారులకు లోకాయుక్త దాడులు చెమటలు పట్టించాయి. బెంగళూరు, కలబురగితోపాటు వివిధ జిల్లాల పరిధిలో గురువారం లోకాయుక్త అధికారులు ఏకకాలంలో వివిధశాఖల ప్రభుత్వ అధికారులపై దాడులు జరిపారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే కారణంతోనే దాడులు కొనసాగాయని లోకాయుక్త అధికారులు తెలిపారు. బెంగళూరులో డీపీఏఆర్ చీఫ్ ఇంజనీర్ టీడీ నంజుండప్ప, బీబీఎంపీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హెచ్‌డీ కల్లేశప్ప, కోలారులో బెస్కాం ఏఈఈ నాగరాజు, కలబురగి ప్రజాపనులవిభాగం చీఫ్ ఇంజనీర్ జగన్నాథ్, దావణగెరె ఫుడ్ సేఫ్టీ అధికారి జీఎస్ నాగరాజు, బాగల్కోటె పంచాయతీరాజ్ శాఖ అకౌంటెంట్ మల్లేశ్, తుమకూరు జిల్లా శిర తాలూకా తావరకెరె పీహెచ్‌సీ డాక్టర్ జగదీశ్, బాగల్కోటె ఎఫ్‌డీఏ మల్లప్ప సాబణ్ణ దుర్గద, విజయపుర ఎఫ్‌డీఏ శివానంద శివశంకర కెంభావిలపై దాడులు జరిగాయి. దావణగెరెలో ఫుడ్‌సేఫ్టీ విభాగంలో డిస్ట్రిక్ట్ స్టాటిస్టికల్ అధికారి జీఎస్ నాగరాజు ఇంటిపైనా లోకాయుక్త అధికారులు దాడులు జరిపారు. దావణగెరె నిజలింగప్ప లే అవుట్‌లోని నాగరాజు ఇంటిపైనా, బంధువుల ఇళ్లపైనా ఫాం హౌస్, కార్యాలయం, సహకారసంఘ కార్యాలయంపైనా దాడులు కొనసాగాయి. తుమకూరు జిల్లా శిర తాలూకా తావరకెరె డాక్టర్ జగదీశ్‌కు సంబంధించి తుమకూరులోని బటవాడి వద్ద ఉండే ఇంటిపైనా, మంజునాథనగర్‌లోని కాంప్లెక్స్, శిర తాలూకాలోని యల్పేనహళ్ళిలో ఇంటిపైనా దాడులు చేశారు. కలబురగి నగరం ఎన్జీఓ కాలనీలోని జాతీయ రహదారుల ప్రాజెక్టు ప్రాధికార ప్లానింగ్ అధికారి జగన్నాథ హలంకు సంబంధించిన ఇంటిపై లోకాయుక్త ఎస్పీ ఉమేశ్ నేతృత్వంలో దాడి చేశారు. పలు పత్రాలు భారీగా నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పీడబ్ల్యూడీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఈయన ఇటీవల జాతీయ రహదారి ప్రాధికారలోకి బదిలీపై వచ్చారు. కలబురగి, బీదర్, బసవకల్యాణ, బెంగళూరుతోపాటు 6 ప్రాంతాల్లో దాడులు జరిపారు. భారీగా ఆస్తులు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు లోకాయుక్త అధికారులు తెలిపారు.



కలబురగి జిల్లాలో స్వాధీనం చేసుకున్న ఆభరణాలు



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.45	5.20
శుక్రవారం సాయంత్రం	శనివారం ఉదయం

9న పోలీస్ రన్: ఎస్పీ

బళ్లారి సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రపోలీస్ రన్ 2025 కార్యక్రమం ఈ నెల9న నిర్వహించనున్నారు. మాదకద్రవ్య రహిత కర్ణాటకను నిర్మించడానికి బళ్లారి జిల్లా పోలీసులు 9న ఉదయం 7 గంటలకు నగరంలోని కనక దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభరాణి ఒక ప్రకటనలో కోరారు. కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమై గడిగి చెన్నప్ప సర్కిల్, గవియప్ప సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, వాల్మీకి సర్కిల్, తాళూరు రోడ్డు క్రాస్ మీదుగా కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణానికి చేరనుందని ఎస్పీ తెలిపారు.



ఎస్పీ శోభారాణి

విద్యాశిఖరం ఎంఆర్ దొరస్వామి కన్నుమూత

● ఇంజనీరింగ్, వైద్య కళాశాలలతో ఎందరినో తీర్చిదిద్దిన తెలుగు తేజం ● సీఎం, డీసీఎం సహా పలువురి నివాళి ● నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళి అర్పిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో గుణాత్మకమైన విద్య అందించాలనే లక్ష్యంతో పీఈఎస్ పేరిట విద్యాసంస్థలను ప్రారంభించి ఇంజనీరింగ్, వైద్యవిద్యారంగంలో దేశంలోనే ప్రముఖమైన సంస్థగా తీర్చి లక్షలాదిమందికి గుణాత్మకమైన విద్య అందించిన విద్యాశిఖరం ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి (88) కన్నుమూశారు. ఇటీవల కొన్నిరోజులుగా వయోభారం సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన బనశంకరి రెండోస్టేజ్‌లోని నివాసంలోనే గురువారం సాయంత్రం తుదిశ్వాస వీడారు. ఆయనకు భార్య రాధామనోహరి, కుమారుడు జవహర్ దొరస్వామి, కుమార్తె డాక్టర్ రూప సురేశ్ ఉన్నారు. మనవళ్లు, మనవరాళ్లతోపాటు బెంగళూరు, చిత్తూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులు ఉన్నారు.

జన్మస్థలం చిత్తూరు జిల్లా..


దొరస్వామి చిత్తూరు జిల్లా యాదమరి మండలం కోణాపల్లి పంచాయతీ నర్రావూరు గ్రామం సాధారణ రైతు కుటుంబం ఎం. రామానాయుడు, ఎం. మీనాక్షమ్మ దంపతులకు 7 నవంబరు, 1937లో జన్మించారు. జన్మించిన దొరస్వామి ఉన్నత విద్యకోసం బెంగళూరుకు బంధువుల ఇంటికి వచ్చారు. ఎంఏ బీఎల్ పూర్తి చేసి న్యాయవాదవృత్తిలో స్థిరపడాలనుకున్న దొరస్వామిని అప్పటి ప్రముఖ రాజకీయనాయకుడు దయానందసాగర్ అధ్యాపకుడిగా కొనసాగాలని సలహా ఇచ్చారు. ఇలా న్యాయవాద వృత్తి నుంచి విద్యావ్యవస్థవైపు వచ్చిన దొరస్వామి కొంతకాలం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత హనుమంతనగర్‌లో పీయూ కళాశాలను ప్రారంభించారు. అక్కడనుంచి ప్రారంభమైన విద్యాసంస్థలు ప్రస్తుతం పీఈఎస్ యూనివర్సిటీగా రాణిస్తోంది. బనశంకరిలో ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్ సిటీలో ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాల క్యాంపస్‌లు ఉన్నాయి. సర్జాపురలో అమాత ఇంటర్నేషనల్ పబ్లిక్‌స్కూల్‌తోపాటు కుప్పంలో మెడికల్ కళాశాల, చిత్తూరులో పీఈఎస్ పబ్లిక్ స్కూల్, కత్రిగుప్పెలో ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లు నిర్వహిస్తున్నారు.

గుణాత్మక విద్యే ఆయన లక్ష్యం

గుణాత్మకమైన విద్య అందిస్తే భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలతోపాటు సమాజానికి మేలు చేస్తారని ఆయన లక్ష్యం పెట్టుకున్నారు. ఆయన విద్యాసంస్థల్లో గుణాత్మకతతోపాటు క్రీడలు, యోగా, నైతికతకు ప్రాధాన్యం ఇచ్చారు. సమాజసేవలోనూ ఆయన తన గొప్పతనాన్ని చాటుకున్నారు. బెంగళూరు నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను 20 ఏళ్లక్రిందటే దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలతోపాటు బోధనలకు అదనంగా ఉపాధ్యాయులను నియమించారు. గతంలో వరదలు వచ్చినప్పుడు ఉత్తర కర్ణాటకలో వరద బాధితులకు ఇళ్లతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సొంతంగా పాఠశాల భవనాలను నిర్మించారు. మైసూరు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన దొరస్వామి అక్కడ భారతరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ నివసించిన క్వార్టర్స్‌ను అందంగా తీర్చారు. లాల్‌బాగ్ ఉద్యానవనం అంటే ఆయనకు ఎనలేని ఆసక్తి. విద్యారంగం, సామాజికసేవ విభాగాలలో రాణించిన దొరస్వామి కన్నుమూత ఎంతో మందిని దిగ్భ్రాంతి కలిగించింది. కుప్పంలాంటి మారుమూల ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించిన పీఈఎస్ సంస్థల చైర్మన్ ఎం.ఆర్.దొరస్వామినాయుడు చాలా మృదు స్వభావి.

విధాన పరిషత్‌లోనూ..

విధానపరిషత్ సభ్యుడిగా వ్యవహరించిన కాలంలో పూర్తిస్థాయి గ్రాంట్లను పాఠశాలల ప్రగతికే కేటాయించారు. 2019లో యడియూరప్ప ప్రభుత్వంలో విద్యాసంస్కరణల సలహాదారుగా కొనసాగారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకునే విధానం ద్వారా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారు. ఆయన విద్యాసంస్థల్లో ఉద్యోగులతోపాటు సమాజంలోని భిన్నమైన వ్యాపార, పారిశ్రామిక నిపుణులతో సన్నిహితంగా ఉండేవారు.



ఎంఆర్ దొరస్వామి (ఫైల్)

మాజీ సీఎం, డీసీఎం నివాళి

దొరస్వామి మృతి పట్ల ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మాజీ సీఎం యడియూరప్ప తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బనశంకరిలోని నివాసంలో పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. డీసీఎం డీకే శివకుమార్ పుష్పగుచ్ఛాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మార్పుకు ఆయన ఎన్నో సేవలు చేశారన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ సీఎం యడియూరప్పతోపాటు పలు విద్యాసంస్థల ప్రముఖులు నివాళి అర్పించారు. పలువురు పూర్వ విద్యార్థులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కమ్మసంఘం ముఖ్యులు రాజగోపాలనాయుడు, రుక్మాంగద నాయుడు, లీలాశంకర్, నీరజాక్షులు నాయుడు, ఎం యోగమూర్తి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఖాద్రీశుడి సంబరం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. ఏటా పాల్గుణ మాసంలో పక్షం రోజుల రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాలను సాక్షాత్తు బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని భక్తుల విశ్వాసం. ఈ నెల 9న ప్రారంభమయ్యే వేడుకలు 23న ముగుస్తాయి. శ్రీవారు రోజుకో అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు.

-ఆంధ్రజ్యోతి, కదిరి



ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి

ముహూర్తాలు బంద్



ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరిగిన నాటి నుంచి ఈ ప్రాంతంలో వివాహాలను నిర్వహించరు. ఎందుకు అని ప్రశ్నిస్తే.. 'నారసింహుడి కల్యాణానికి ఎదురు కళ్యాణమా?' అని బదులిస్తారు. అందుకే ముహూర్త బలాలు ఎలా ఉన్నా, బ్రహ్మోత్సవాలు ముగిసేవరకూ ఎవరూ వివాహం చేసుకోరు. స్వామివారి కల్యాణం తరువాతే తమ కల్యాణం గురించి ఆలోచిస్తారు. నారసింహుడిని ఇలవేల్పుగా కొలిచేవారు ఈ పక్షం రోజులపాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.

కదిరి మల్లెల పరిమళాలు



కదిరి మల్లెలకు దేశంలోనే పేరుంది. ఇక్కడి మల్లెల పరిమళం మరే ప్రాంతంలోనూ కనిపించదంటారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల సమయానికి విరబూసే మల్లెలు మరింతగా గుభాలిస్తాయి. ఇక ఈ ప్రాంతంలో మాత్రమే కన్పించే దవణం, మరువం సౌరభాలు ఖాద్రీశుడికి ఎంతో ప్రీతిపాత్రం. బ్రహ్మరథంలో ఊరేగే శ్రీవారికి దవణాన్ని మొక్కుబడిగా సమర్పిస్తారు. ఇటీవలి కాలంలో కదిరి దవణాన్ని సెంటు, అత్తరు తయారీలో వినియోగిస్తున్నారు.

ఖాద్రి అంటే..

శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటి నారసింహావతారం. కదిరి పట్టణ పూర్వ నామం ఖాద్రీపురం. ఖ అంటే విష్ణు పాదం అని, 'ద్రి' అంటే కొండ అని అర్థం. నారసింహుడు ఈ ప్రాంతంలో పాదం మోపినందున ఖాద్రి అన్న పేరు వచ్చిందని చెబుతారు. ఇదికాక మరో పురాణ గాథ ప్రచారంలో ఉంది. 'ఖదిర' అనే పేరుగల చండ్ర వృక్షం నుంచి నారసింహుడు ఉద్భవించినందున ఈ క్షేత్రానికి ఖాద్రి అన్న పేరు వచ్చిందని అంటారు. కృతయుగంలో ఉద్భవించిన లక్ష్మీనరసింహుడి కోసం పట్నం పాలేగాళ్లు 10వ శతాబ్దానికి ముందే ఆలయాన్ని నిర్మించినట్లు ఆనవాళ్ళు ఉన్నాయి. ప్రస్తుతం నారసింహుడి ఆలయం ఉన్న చోట 10వ శతాబ్దం మధ్య కాలంలో పశ్చిమ చాళుక్య రాజవంశీయులు దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. భృగుతీర్థంలో మునిగి ఉన్న ఉత్సవ మూర్తులను వసంత రుతువులో వెలికి తీసి ప్రతిష్ఠించడం వలన శ్రీవారిని వసంత వల్లభుడు అని కూడా పిలుస్తారు. మహాభక్తులైన 12 మంది ఆళ్వార్‌లు రంగ మంటపాన్ని, కొక్కంటి పాలెగాళ్ళు పడమర గోపురాన్ని, తాడిపత్రి పాలెగాళ్ళు కొటాయి మంటపాన్ని నిర్మించారు.



ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణ గోపురాలు


చూడండి.. కనులారా..

ఖాద్రీ లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్న అనంతరం భక్తులు దర్శించుకోవాల్సిన క్షేత్రాలు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి. కదిరి, రాయచోటి మార్గంలో 12 కి.మీ. దూరంలో గాండ్లపెంట మండలం, కటారుపల్లిలోని యోగివేమన ఆలయం ఉంది. అత్యంత విశాలమైన వటవృక్షంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన తిమ్మమ్మ మర్రిమాను కూడా ఇదే మార్గంలో నంబులపూలకుంట మండలం గూటిబైలు వద్ద ఉంది. కదిరి- హిందూపురం రహదారిలో పాలబావి ఉంది. ఎంత కరువు వచ్చినా ఈ బావిలో నీరు ఇంకిపోదు. మండుటెండలో సైతం పొంగిపొర్లడం దీని ప్రత్యేకత. నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ప్రమాణాలకు పేరు.

మూల విరాట్టు... ప్రత్యేకం

కదిరి నారసింహుడు స్వయంభువు. శ్రీవారు ప్రహ్లాద సమేతుడై గర్భాలయంలో కొలువుదీరారు. అష్టభుజుడైన నారసింహుడు దుష్టరాక్షసుడైన హిరణ్యకశపుడిని తన తొడలపై పరుండబెట్టుకుని.. గోళ్లతో వక్షస్థలాన్ని చీలుస్తూ కనిపిస్తారు. నాలుగు హస్తాలలో శంకు, చక్ర, ఖేడ్య, ఖడ్గములను ధరించి ఉంటారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీవారి గర్భాలయానికి ఎడమ భాగాన, మరో ఆలయంలో కొలువుదీరి ఉన్నారు. నిత్యం అభిషేకం అనంతరం శ్రీవారి వక్ష స్థలం నుంచి స్వేద బిందువులు ఉద్భవించడం. మూల విరాట్టు ప్రత్యేకత.

9న అంకురార్పణ..
20న తేరు..
బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన స్వామి
పక్షం రోజులు కదిరిలో సందడే సందడి



ప్రహ్లాదుల మూల విరాట్టు

పాప విమోచనం

ఆలయానికి పడమర భాగాన, అర్జుననది ఒడ్డున భృగుతీర్థం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి శ్రీవారిని స్మరించుకున్నారు. ఆ మహర్షి కోరిక మేరకు శ్రీవారు స్వయంగా శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలు అందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆ ఉత్సవ విగ్రహాలే ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నాయి. భృగుతీర్థంలో స్నానం చేసి శ్రీవారిని దర్శించుకుంటే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం.



పాలబావి

అంకురార్పణతో మొదలు

పదిహేను రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో మొదలై తీర్థవాదితో ముగుస్తాయి. కల్యాణోత్సవం నాటి నుంచి ప్రతిరోజూ ఓ ప్రత్యేక వాహనంలో తిరువీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఏడాదిలో అన్నిరోజులు ఆలయంలో మాత్రమే దర్శనమిచ్చే శ్రీవారు.. భక్తుల చెంతకే వెళ్లి దర్శనమివ్వడం బ్రహ్మోత్సవాల ప్రత్యేకం. 9న అంకురార్పణం, 10న కల్యాణోత్సవం, 11న హంసవాహనం, 12 సింహ వాహనం, 13న హనుమంత వాహనం, 14న బ్రహ్మగరుడసేవ, 15న శేషవాహనం, 16న సూర్య చంద్రప్రభ, 17న మోహినీ ఉత్సవం, 18న ప్రజాగరుడ సేవ, 19న గజవాహనం, 20న బ్రహ్మరథోత్సవం(తేరు), 21 అలకోత్సవం, 22న తీర్థవాది, 23న పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు.



ఆలయంలోని ధ్వజస్తంభం



ఎమ్మెల్సీ పదవిపై టెన్షన్... టెన్షన్..!

- ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యంపై సందేహాలు
- సామాజిక సమతౌల్యం ఒక్కటే ఆశావహం
- త్యాగాలు చేసినవారికి చాన్స్ ఇస్తారా..?
- అభ్యర్థుల ప్రకటన శనివారం..?







అనంతపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులపై ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కారణంగా సాధారణ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన నాయకులు పదవులను ఆశిస్తున్నారు. సామాజికవర్గ సమతుల్యం పాటిస్తే తమకే తప్పనిసరిగా పదవి దక్కుతుందని కొందరు అంచనా వేసుకుంటున్నారు. దశాబ్దాలుగా పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడిన నేతలు సైతం ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఏ ప్రాతిపదికన ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలనే అంశంపై టీడీపీ అధిష్టానం కసరత్తు చేస్తోంది. జనసేన నుంచి నాగబాబును శాసనమండలికి పంపాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. దీంతో జనసేనకు ఉమ్మడి జిల్లాలో అవకాశం లేదని తేలిపోయింది. టీడీపీ నుంచి ఎవరికి అవకాశం ఇస్తారనే చర్చ కొనసాగుతోంది. పార్టీ సీనియర్ నాయకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, గుండుమల తిప్పేస్వామి, గడ్డం సుబ్రమణ్యం ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్న వారిలో ఉన్నారు. నియోజకవర్గాన్ని త్యాగం చేసిన నాయకుడిని పరిగణనలోకి తీసుకుంటే.. ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు అవకాశం ఉంటుంది. సామాజిక వర్గాన్ని పరిగణలోకి తీసుకుంటే బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మైనార్టీ కోటాలో మాజీ ఎంపీ సైపుల్లా తనయుడు కేఎం జకీవుల్లాకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశాలుంటాయని ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ అధినాయకత్వంత తీవ్రంగా కసరత్తు చేస్తోందని పార్టీ ముఖ్య నాయకుల ద్వారా తెలిసింది. ఎమ్మెల్సీ పదవిని దక్కించుకునేందుకు ఆశావాహులు ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని కోరినట్లు తెలిసింది.

ప్రాధాన్యం ఉంటుందా..?

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాలను రాష్ట్రంలోని 31 నియోజకవర్గాల నుంచి జనసేన, బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారు. ఆ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు త్యాగాలు చేశారు. వీరికి మొదటి ప్రాధాన్యం ఇచ్చేలా ఉంటే.. ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశం ఉంది. కష్టకాలంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేసిన నేతలకే ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే యోచనలో పార్టీ అధిష్టానం ఉండటం ఆశావాహులను మరింత కలవరపెడుతోంది. సామాజికవర్గాలను పరిగణలోకి తీసుకున్నా.. తమదాకా వస్తుందా అన్న అనుమానాలు ఆశావహుల్లో ఉన్నాయి. అయినప్పటికీ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.


సామాజికంగానూ పోటీ..

టీడీపీ అధిష్టానం సామాజిక సమతౌల్యాన్ని పరిగణలోకి తీసుకుంటే ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్సీ పదవి దక్కే చాన్స్ ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయినా ఈ అంశం ఆశావహుల్లో ధైర్యాన్ని నింపడం లేదు. సామాజికవర్గాల పరంగా పదుల సంఖ్యలో ఎమ్మెల్సీ పదవి రేసులో ఉండటమే దీనికి కారణం. పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు... సామాజికవర్గాల ఆశావహుల్లో బుద్దా వెంకన్న, బీద రవిచంద్ర, కొమ్మాలపాటి, దేవినేని ఉమ, రెడ్డి సుబ్రమణ్యం, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, జంగా కృష్ణమూర్తి పేర్లు వినిపిస్తున్నాయి. ఇదివరకూ ఎమ్మెల్సీలుగా పనిసిన బీటీ నాయుడు, పరిచూరి అశోక్‌బాబు మరో చాన్స్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. మైనార్టీలలో విశాఖకు చెందిన మహమ్మద్ నజీర్ ఉన్నారు. ఇలా అన్ని సామాజికవర్గాల నుంచి ఇద్దరు ముగ్గురేసి నాయకులు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. ఆయా సామాజికవర్గాల్లోని నేతల మధ్య పోటీ నేపథ్యంలో ఏ సామాజికవర్గం నేతను ఎమ్మెల్సీ పదవి వరిస్తుందో తేలేందుకు 48 గంటలపాటు వేచి చూడాల్సిందే. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది. దీంతో ఆశావహులలో టెన్షన్ మరింత పెరిగింది.

మెరిసేదంతా బంగారమే!

జ్యువెలరీ షాపుల్లో మోసాలు

- రాళ్లకూ బంగారంతో సమానంగా ధరలు
- తూకాల్లోనూ తేడాలు
- వేయింగ్ మిషన్ల రెన్యువల్ ఉత్తమాటే..
- వినియోగదారులకు నిండా మోసం
- తనిఖీలు మరచిన తూనికలు, కొలతల అధికారులు





బంగారం ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎంతదాకా పెరుగుతాయో కూడా తెలియదు. దీంతో ఇప్పుడే అంతో ఇంతో బంగారం కొనిపెట్టుకోవాలని చాలామంది ఆరాట పడుతున్నారు. జ్యువెల్లరీ షాపులకు క్యూ కడుతున్నారు. వేలు, లక్షల రూపాయలు పోసి కొన్న బంగారం స్వచ్ఛమైనదేనా, చెల్లించిన డబ్బుకు సరిపోయే తూకం నగ ఇచ్చారా? అన్నది అనుమానమే. చాలా షాపుల్లో బంగారం మాటున రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. రాళ్లతో ఉన్న బంగారు నగలను కొనుగోలు చేస్తే షాపు నిర్వాహకుడు రాళ్లు, బంగారాన్ని వేర్వేరుగా తూకం వేసి, ధర లెక్కగట్టాలి. ఎందుకంటే బంగారం, రాళ్ల ధరకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అలా చేయట్లేదు. నగ మొత్తంగా తూకం వేసి బంగారంతో సమానంగా రాళ్లకూ ధర కట్టి వినియోగదారులకు అంటగడుతున్నారు. అర్థత లేని వేయింగ్ మిషన్లతో మోసం చేస్తున్నారు. వాటిని కనీసం రెన్యువల్ చేయట్లేదు. దీంతో జిల్లాలోని కొన్ని షాపుల్లో నిర్వాహకులు చెప్పిందే తూకంగా, ఇచ్చిందే బంగారంగా మారిపోయింది. తరచూ తనిఖీలు చేస్తూ ఈ మోసాలకు చెక్ పెట్టాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు ఆ విషయాన్నే మరిచారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖను అధికారులు, సిబ్బంది కొరత కూడా వేధిస్తోందని సమాచారం. వెరసి.. పలు జ్యువెల్లరీ షాపుల్లో వినియోగదారులు మోసపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

స్వచ్ఛత సంగతేంటో..?

బంగారు నగ కొనుగోలు చేసేందుకు వెళ్తే దుకాణ నిర్వాహకుడు చెప్పిన మేరకే స్వచ్ఛత అని వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అది 22 క్యారెట్లా, 24 అని వినియోగదారులు గుర్తించలేకపోతున్నారు. పలు దుకాణదారులు తూకాల్లో చేస్తున్న మోసాన్ని గ్రహించలేకపోతున్నారు. వినియోగదారులకు బంగారంపై ఉన్న మక్కువను క్యాష్ చేసుకుంటున్న కొందరు కేటుగాళ్లు తక్కువ తూకాలతో వారి జేబు గుల్ల చేస్తున్నారు. ఇలాంటి బంగారు దుకాణాలపై నిత్యం తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకోవాల్సిన తూ నికలు, కొలతల శాఖాధికారులు ఆ విషయా న్నే మరిచారు. ఆ శాఖలో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బం ది కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.




బంగారం దుకాణంలో నగలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

గుర్తించకపోతే అంతే...

సాధారణంగా బంగారు దుకాణాల్లో మిల్లీ గ్రాముల నుంచి వెయిట్ చూపించే యంత్రాలుండాలి. అలాంటివి జిల్లాలో అతి తక్కువ దుకాణాల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా చిన్నపాటి బంగారు నగలు కొనుగోలు చేసే వినియోగదారులు మోసపోతున్నారు. మెజార్టీ దుకాణాల్లో 10 మిల్లీ గ్రాముల నుంచి మొదలయ్యే యంత్రాలను వినియోగిస్తున్నారు. తద్వారా వినియోగదారులకు తూకాలు అర్థంకాకుండా మోసాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో 24 క్యారెట్ల బంగారు నగలు తీసుకున్న వారికి... వారివద్దనున్న నకిలీ యంత్రాలతో అవి 22 క్యారెట్లు బంగారు నగలని తెలుసుకోలేకపోతున్నారు. తూకాల్లో గ్రాము నుంచి 1.50 గ్రాముల వరకు బంగారాన్ని తక్కువ ఇస్తున్నట్లు సమాచారం. మోసాలకు పాల్పడుతున్న దుకాణాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. దీంతో దుకాణదారులు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారిందనడంలో సందేహం లేదు.

రాళ్ల బంగారంతో జర జాగ్రత్త...

చాలా మంది... రాళ్ల బంగారంపై ఎక్కువ మక్కువ చూపుతుంటారు. చేతి ఉంగరాలు, చైన్ లాకెట్‌లు, నక్లెస్ తదితరాలను రాళ్లతో తయారు చేయించుకుంటుంటారు. బంగారం ధర, స్టోన్ ధరల్లో చాలా వ్యత్యాసాలున్నాయి. కొంత మంది బంగారు దుకాణదారులు దీనిని క్యాష్ చేసుకుంటూ వినియోగదారులను మోసం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా రాళ్లతో ముడిపడిన బంగారు నగలను కొనుగోలు చేస్తే... బంగారం, రాళ్లను వేర్వేరుగా తూకం వేయాలి. వాటి ధరలను బిల్లుల్లో సైతం వేర్వేరుగా చూపించాల్సి ఉంటుంది. 10 గ్రాముల స్టోన్ కలిగిన ఉంగరం తీసుకుంటే... అందులో దాదాపు ఒక మిల్లీ గ్రాము స్టోన్ ఉంటే... కొందరు కేటుగాళ్లు మొత్తం 10 గ్రాములు బంగారం ధరకే అమ్మేస్తున్నట్లు సమాచారం.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

వేయింగ్ మిషన్ల రెన్యువల్ సంగతేంటో..?

సాధారణంగా బంగారం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరూ తమ వద్ద ఉన్న వేయింగ్ మిషన్లకు తూనికలు, కొలతల శాఖ నుంచి రెన్యువల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అధికారులు.. ఆ మిషన్‌ను పరిశీలించి తక్కువ తూకాలన్నా.. ఏదైనా సమస్యఉన్నా సరిచేసి, రెన్యువల్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. కొంతమంది ఆ శాఖ ఇచ్చే రెన్యువల్ సర్టిఫికెట్లను తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఎన్ని బంగారు దుకాణాలున్నాయి, ఎంతమంది రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల విషయానికొస్తే వారు ఆడిందే ఆట... పాడిందే పాట అన్న చందంగా తయారైందనే చెప్పాలి. ఫైనాన్స్ సంస్థల్లోకి బంగారు నగలను తాకట్టు పెట్టుకునేందుకు వెళ్తే.. వారు వేసిన తూకం... ఇచ్చే డబ్బు తీసుకుని రావాల్సిందేనన్న బాధితులు వాపోతున్నారు. కొందరు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకు నిర్వాహకులు వేయింగ్ మిషన్లలో తక్కువ తూకాలు నమోదు చేసుకుని, వినియోగదారులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఆ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు, బంగారం దుకాణాల్లో వేయింగ్ మిషన్లకు రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారా, లేదా అని పరిశీలించాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు పట్టించుకోవట్లేదన్నది బహిరంగ రహస్యమే. కార్యాలయానికి వచ్చిన వారికి మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తూ తమ పనైపోయిందని అధికారులు భావిస్తుండటంతో మోసాలకు అడ్డకట్ట వేయలేకపోతున్నారనడంలో సందేహం లేదు.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం వద్దకు వేయింగ్ మిషన్ల రెన్యువల్‌కు వచ్చిన నిర్వాహకులు (ఫైల్)

తనిఖీలు చేస్తున్నాం..

బంగారం దుకాణాల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నాం. పలుచోట్ల షాపుల్లో బంగారం, స్టోన్ ధరలు సెపరేటుగా వేయకపోవడాన్ని గుర్తించి, జరిమానాలు విధించాం. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. శాఖలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే.

-మహమ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

టీవీ శంకర నారాయణన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత తిరువలంగడు వెంబు అయ్యర్ శంకర నారాయణన్ 1945 మార్చి 7న తంజావూరు జిల్లా మైలాదుత్తురై (మాయవరం లేదా మయూరం) జన్మించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత కళాకారుడు. దేశ విదేశా లలో పలు కచేరీలు నిర్వహించడమే కాక ఆల్బమ్స్‌ను రూపొందించారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీచే సంగీత కళానిధి, గాయక శిఖామణి, విద్యా తపస్వి, సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందారు. 2022 సెప్టెంబరు 2న కన్నుమూశారు.

పరమహంస యోగానంద (వర్ధంతి)



పరమహంస యోగానంద 1893 జనవరి 5న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు ముకుంద్ లాల్ ఘోష్. సన్యాసి, యోగి, గురువుగా పేరొందారు. ధ్యానం, క్రియా యోగా ద్వారా సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్), యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వైఎస్ఎస్) సంఘాలను ఏర్పాటు చేసి చైతన్యం కల్పించారు. 32 ఏళ్లపాటు అమెరికాలో నివసించి అక్కడ కూడా యోగాను విస్తృతం చేశారు. 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి' అనే పుస్తకాన్ని ప్రచురించగా 20వ శతాబ్దంలో వంద ఆధ్యాత్మిక పుస్తకాలలో ఒకటిగా నిలిచింది. 1952 మార్చి 7న కన్నుమూశారు.

వివియన్ రిచర్డ్స్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ వివియన్ రిచర్డ్స్ 1952 మార్చి 7న ఆంటిగ్వా దేశ రాజధాని సెయింట్‌జాన్స్‌లో జన్మించారు. పూర్తి పేరు సర్ ఐజాక్ వివియన్ అలెగ్జాండర్ రిచర్డ్స్. వెస్ట్ ఇండీస్ తరఫున క్రికెట్‌లో పేరొందారు. 2002లో వన్డేలలో ఆల్‌టైమ్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచారు. సర్ బ్రాడ్‌మన్, సచిన్ టెండూల్కర్‌ల తర్వాత ఆ స్థాయిలో గుర్తింపు పొందారు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక అప్పుడప్పుడు వ్యాఖ్యాతగా, టీమ్ మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు. ఆర్డర్ ఆఫ్ ది కరీబియన్ కమ్యూనిటీ (ఓసీసీ) గౌరవం అందుకున్నారు.

అనుపమ్ ఖేర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన నటుడు 'పద్మభూషణ్' గ్రహీత అనుపమ్ ఖేర్ 1955 మార్చి 7న పంజాబ్ రాష్ట్రం సిమ్లాలో (ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో ఉంది) జన్మించారు. హిందీలో 500కుపైగా సినిమాలలోనూ, పలు నాటకాలలో నటించారు. క్యారెక్టర్ నటుడిగా, కమెడియన్‌గా పేరొందారు. దర్శకుడిగా, నిర్మాతగాను రాణించారు. రెండు జాతీయ ఫిల్మ్ అవార్డులు, 8 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలతోపాటు ఉత్తమ హాస్యనటుడిగా ఐదుసార్లు అవార్డులు పొందారు. సెన్సార్‌బోర్డు, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. బఫ్టా పురస్కారానికి నామినేట్ అయ్యారు. అంతేకాక కొన్ని పుస్తకాలు కూడా రచించారు. 2021లో హిందూ యూనివర్సిటీ ఆఫ్ అమెరికానుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

త్వరలోనే పీఎంఏవై ఇళ్ల నిర్మాణాలు

బంగారపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాజ్ యోజన (పీఎంఏవై) కింద ఈసారి గ్రామపంచాయతీకి ఎక్కువ ఇళ్ల నిర్మాణానికి అవకాశం లభించిందని త్వరలోనే నివాస రహితులకు ఇళ్లు కల్పిస్తామని డీకే హళ్ళి (దొడ్డూరు కరపనహళ్ళి) గ్రామపంచాయతీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఇళ్లకోసం 120కుపైగా అర్జీలు వచ్చాయని అందుకు సంబంధించి జీపీఎస్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను నిర్మిస్తామన్నారు. కాగా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే నారాయణస్వామి తమ ప్రత్యేక నిధులకింద రూ.3కోట్లు కేటాయించారన్నారు. దీనికితోడు 15వ ఆర్థికసంఘం నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామంలో మౌలిక సదుపాయాలను పెంచుతామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా అవసరమైన మోటారు, పైపులు కొనుగోలు చేశామన్నారు. కాగా ఆలదమర సర్కిల్ నుంచి బేతమంగలకు వెళ్లే మార్గంలో ప్రమాదాలు అధికమైన తరుణంలో వాటి నియంత్రణకు చెన్నై ఎక్స్‌ప్రెస్ కారిడార్ రోడ్డు వరకు సుమారు రూ.3లక్షల వ్యయంతో వరుసగా విద్యు ద్దీపాలు ఏర్పాటు చేసేందుకు అంచనా వేశామని త్వరలోనే పనులు చేపడ తామన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు సులోచనా, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు కలావతి రమేశ్, సభ్యులు కెహెచ్ మునియప్ప, అమరప్ప, చంద్రమ్మ, యల్లమ్మ, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ సాధారణ సమావేశంలో అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ తదితరులు

చెరువులను కాపాడుకుందాం...



అభియానలో పాల్గొన్న కృపానిధి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం తదితరులు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజసిద్ధమైన చెరువులను కాపాడుకుందామని కృపానిధి విద్యాసంస్థల సహసంస్థాపకులు, ఉపాధ్యక్షురాలు గీతాప్రియ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో వర్తూరు చెరువును కాపాడుకుందాం అనే నినాదంతో అభియాన నిర్వహించారు. జాతీయ పురస్కార నటుడు, దర్శకుడు, పర్యావరణ ప్రేమికుడు సురేశ్ హెబ్బీకర్ అభియానకు శ్రీకారం చుట్టారు. చెరువులు కలుషితం అవుతున్నాయని, కొన్ని చోట్ల ఆక్రమణకు గురవుతున్నాయని, పర్యావరణం నాశనం పరిణామాలపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యావేత్త గీతాప్రియా, పర్యావరణ ప్రేమికురాలు పక్షి వీక్షక్ర పసాద్ జావగల్ పాల్గొన్నారు. స్వయం సేవకులు, స్థానిక నివాసులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. వర్తూరు చెరువు ఎదుర్కొంటున్న సమస్యలు, పునశ్చేతనం కల్పించే అంశంపై చర్చించారు. గీతాప్రియా మాట్లాడుతూ చెరువులోకి రీసైక్లింగ్ చేయకుండా డ్రైనేజీ నీరు, చెత్తా చెదారం వదులుతుండడంతో కలుషితం అవుతోందన్నారు. వీటి ప్రభావం భూగర్భజలాలపైనా ఉందన్నారు. వర్తూరు వాసులకోసం వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయడం ద్వారా సహజత్వం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సురేశ్ హెబ్బీకర్ మాట్లాడుతూ చెరువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గీతాప్రియా ఇందుకు చొరవ చూపడం అభినందనీయమన్నారు. అభియానలో పెద్దసంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

నీటి అక్రమ వినియోగంపై చర్యలు



స్వాధీనం చేసుకున్న కేబుల్ ఇతర సామగ్రితో అధికారులు

శిడ్లఘట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బయలుసీమ ప్రాంతాలలో భూగర్భ జలాలు పెంచేందుకు ఉద్దేశించిన హెచ్ఎన్ వ్యాలి నీటిని అక్రమంగా తోటలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ బిఎన్ స్వామి తెలిపారు. తాలూకాలోని అబ్లూడు, గుడిహళ్ళి గ్రామాలలో చెరువులనుంచి అక్రమ విద్యుత్ కనెక్షన్‌లతో నీటిని వినియోగిస్తున్నారనే సమాచారంతో తహశీల్దార్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. బెస్కాం, పోలీసుశాఖ సిబ్బంది కార్యాచరణలో పాల్గొని అక్రమంగా వినియోగిస్తున్న మోటర్, పంప్, కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చెరువునీటిని అనుమతి లేకుండా వినియోగించడం నేరమన్నారు. అంతేకాక అక్రమ విద్యుత్ కనెక్షన్‌తో నీటిని పంపింగ్ చేయడం మరొక నేరమన్నారు. ఇలా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. పంప్‌సెట్ సామగ్రిని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలకు చిన్ననీటి పారుదలశాఖకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. కార్యాచరణలో రూరల్‌స్టేషన్ ఎస్సై నాగరాజ్, బెస్కాం సహాయక ఇంజనీర్ కిరణ్, ఆర్ఐ వేణుగోపాల్, విలేజ్ అకౌంటెంట్ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ దొరస్వామి మృతి కలచివేసింది: ఏపీ సీఎం చంద్రబాబు

చిత్తూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి) :పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాప అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి నాయుడు మృతి చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 12విద్యాసంస్థలను నడుపుతూ విద్యాదాతగా నిలిచారన్నారు. కుప్పం ప్రాంతంలో పీఈఎస్ విద్యాసంస్థల ద్వారా విశేష సేవలందించిన దొరస్వామి మృతి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ... దొరస్వామి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను అని పేర్కొన్నారు దొరస్వామి నాయుడి మృతి పట్ల మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, పులివర్తి నాని,వీఎం థామస్, బానుప్రకాష్, మురళీమోహన్ సంతాపం తెలిపారు.

ఆవుల కంటైనర్ పట్టివేత

గుత్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నుంచి బెంగళూరుకు అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటైనర్‌ను గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు రాగానే డ్రైవర్, క్లీనర్ వాహనం వదిలి పారిపోయారు. మంత్రాలయం వైపు నుంచి బెంగళూరుకు కేె36సీ 7382 అనే కంటైనర్ వాహనంలో ఎద్దులు, ఆవులను తరలిస్తున్నట్లు వెనుక వాహనంలో వస్తున్న కర్ణాటక వాసి అమృతజయరాం గమనించారు. డయల్ 100కు ఆమె సమాచారం ఇచ్చారు. గుత్తి పట్టణంలోకి కంటెయినర్ రాగానే గాంధీ సర్కిల్ వద్ద ఆమె అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు రావడంతో డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. కంటెయినర్‌లో దాదాపు 20 మూగజీవాలు ఉన్నట్లు సమాచారం. ఓ న్యూస్ చానల్ నిర్వాహకురాలైన అమృత జయరాం.. బీజేపీ నాయకుడు తిమ్మారెడ్డి తదితరులు సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.

అన్న హత్యకు తమ్ముడి సుపారీ

- అన్న కొడుకుని కూడా చంపేయాలని ఒప్పందం
- హత్యల కుట్ర భగ్నం
- ఇద్దరు నిందితుల అరెస్టు
- వేటకొడవళ్లు, నగదు స్వాధీనం



నిందితులతో పోలీసులు

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల వివాదం, చెప్పుతో కొట్టారన్న అవమానంతో సొంత అన్న, అతడి కుమారుడిని హత్య చేసేందుకు తమ్ముడే సుపారీ ఇచ్చాడు. అడ్వాన్సు ఇవ్వడంతో పాటు హత్యకు అవసరమైన వాటిని సమకూర్చారు. దీనిపై ఉప్పందుకున్న రాయదుర్గం పోలీసులు.. హత్యల కుట్రను భగ్నం చేశారు. ఇద్దరు నిందితులతోపాటు వేటకొడవళ్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం సీఐ జయనాయక్ స్థానిక స్టేషన్‌లో వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలూకా కెరెకొండాపుర గ్రామానికి చెందిన మురారి దామోదర్‌గౌడ్, అతడి అన్న మధుసూదన్ గౌడ్ మధ్య ఆస్తి వివాదం ఉంది. తల్లిదండ్రుల ఆస్తి 12 ఎకరాల్లో నాలుగెకరాల తోటను మధుసూదన్‌కు, మరో నాలుగెకరాల వర్షాధార భూమిని అక్క సుస్మితకు, మిగిలినది దామోదర్ గౌడ్‌కు పంచారు. అలాగే మధుసూదన్‌కు తల్లి పేరుతో ఉన్న నాలుగు సెంట్ల స్థలంతోపాటు అందులో నిర్మించిన ఇంటిని కూడా వాటా కింద ఇచ్చారు. తండ్రి కర్ణాటకలోని రాంపుర గ్రామంలో ఎకరా భూమిలో ప్లాట్లు వేసి, అమ్మగా మిగిలిన వాటిలో నాలుగు ప్లాట్లు తల్లి పేరుతో ఉన్నాయి. వాటిలో దామోదర్‌గౌడ్ కాంప్లెక్స్ కట్టాలని నిర్ణయించుకున్నాడు. ఆ దిశగా అన్న మధుసూదన్ ఇంటికెళ్లగా.. వదిన సుగుణ, వారి కొడుకు భార్గవ్‌తో గొడవ జరిగింది. దీంతో దామోదర్ గౌడ్‌పై అన్నతో పాటు అతడి కుమారుడు, వదిన కలిసి చెప్పుతో దాడి చేసి, అవమానపరిచారు. దీనిని మనసులో పెట్టుకున్న దామోదర్‌గౌడ్ అన్న, అతడి కుమారుడిని చంపించాలనుకున్నాడు. అపుడు వారి ఆస్తి కూడా తనకు దక్కుతుందనుకున్నాడు.

రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల ఆదికేశవులు హత్యలో నిందితుడుగా ఉన్న మూడుముళ్ల మారుతీరెడ్డిని దామోదర్ గౌడ్ సంప్రదించాడు. అన్న, అన్న కొడుకును హతమార్చేందుకు రూ.23 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.మూడు లక్షలు అడ్వాన్స్ కింద ముట్టజెప్పాడు. కుట్ర విషయం తెలుసుకున్న పోలీసులు పల్లేపల్లి గేటు వద్ద కారులో ఉన్న దామోదర్ గౌడ్, మారుతీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మధుసూదన్ గౌడ్, భార్గవ్‌ను కారులో కిడ్నాప్ చేసి, ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో చంపి, శవాలను పడేయాలని కుట్ర పన్నారు. అమలు చేసే ప్రయత్నంలో ఉండగా పోలీసులు భగ్నం చేశారు. నిందితుల నుంచి రూ.మూడు లక్షల నగదు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయనాయక్ వివరించారు.

వేధింపులు భరించలేకున్నాం..

- పోలీసులను ఆశ్రయించిన మహిళలు

సోమందేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వేధింపులు భరించలేకపోతున్నామనీ, రక్షణ కల్పించాలని గురువారం బాధిత మహిళలు.. పోలీసులను ఆశ్రయించారు. మండల కేంద్రంలో చేనేత కార్మికులు అధికంగా నివసిస్తున్నారు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకుని, ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రూపు ష్యూరిటీ పేరుతో 10వేల నుంచి రూ.40 వేలదాకా రుణాలిచ్చారు. పది మంది మహిళలను గ్రూపుగా చేసి, రుణాలు మంజూరు చేశారు. తర్వాత రుణాల వసూలు పేరుతో వేధిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు లేవనీ, అప్పులు చెల్లించడానికి మూడు నెలలు గడువివ్వాలని కోరినా బాగేపల్లికి చెందిన ఫైనాన్స్ సంస్థ మేనేజర్ రంజిత్, ఉద్యోగి గంగరాజు ససేమిరా అంటున్నారని వాపోయారు. రుణం చెల్లించేందుకు గడువు ఇప్పించాలని పోలీసులను కోరారు. విషయం బయటకు పొక్కడంతో ఫైనాన్స్ సంస్థ దిగొచ్చింది. రెండు నెలలు మాత్రమే వ్యవధి ఇస్తామనీ, అప్పటికీ చెల్లించకపోతే ఇళ్లు జప్తు చేస్తామని బెదిరించినట్లు బాధిత మహిళలు శోభ, సుమతి, రాధ, మంజుల, ప్రమీళమ్మ, శాంతమ్మ, సాయిలక్ష్మి తెలిపారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధుల ఒత్తిళ్లు భరించలేక కొందరు ఊరు వదిలి పారిపోయినట్లు వారు వాపోయారు. ఈ బెదిరింపులు ఇలా కొనసాగితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని మహిళలు ఆవేదన చెందారు.



పోలీసు స్టేషన్‌లో గోడు చెప్పుకుంటున్న బాధిత మహిళలు

గరుడ గ్యాంగ్ క్రిమినల్ అరెస్టు



నిందితుడు ఇసాక్

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గరుడ గ్యాంగ్‌కు చెందిన ఓ క్రిమినల్ ఇసాక్‌ను సినిమా రీతిలో చేజింగ్ చేసి మణిపాల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గరుడ గ్యాంగ్ అంటే దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో హడలెత్తిపోయే పరిస్థితి ఉంది. బెంగళూరుకు అనుబంధమైన నెలమంగలలో ఓ నేరానికి సంబంధించి ఇసాక్‌ను అరెస్టు చేయాలని నెలమంగల పోలీసులు గాలింపులు జరుపుతున్నారు. మణిపాల్‌లో ఓ యువతితో కలసి సరదాగా గడిపేందుకు వెళ్లినట్టు గుర్తించారు. అతడిని బంధించేందుకు నెలమంగల పోలీసులు ప్రయత్నించగా మణిపాల్ జిల్లా అధికారి కార్యాలయం సమీపంలో ఇసాక్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈ ప్రక్రియలో రెండు కార్లు, ఓ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి వేగంగా దూసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అప్పటికే నెలమంగల పోలీసులు, మణిపాల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మణిపాల్ ఇన్‌స్పెక్టర్ దేవరాజ్ బృందంతోపాటు వెళ్లారు. అతడి కారును ఛేజ్ చేసి అడుకున్నారు. అంతలోనే కారునుంచి దూకి పరారయ్యేందుకు ఇసాక్ ప్రయత్నించాడు, నెలమంగల, మణిపాల్ పోలీసులు చుట్టుముట్టి ఇసాక్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారులో అతడి గర్ల్‌ఫ్రెండ్ ఉన్నట్టు గుర్తించి ఆమెను కూడా అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

వన్యప్రాణుల కోసం తొట్టెల్లో నీరు



తొట్టెలో నీరు నింపుతున్న సింహగర్జన వేదిక సభ్యులు

బంగారపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కావడంతో వన్యప్రాణులకోసం నీటిని సమకూర్చేలా సింహఘర్జన వేదిక కార్యకర్తలు అటవీప్రాంతాలలోని తొట్టెలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చే పనులు చేపట్టారు. బంగారపేట తాలూకాలోని డీకేహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని అడవులలో జింకలు, అడవిపందులు, కుందేళ్లు, నెమలులు, కోతులు, చింపాంజీలు ఇతరత్రా వన్యప్రాణులు ఉన్నాయి. ప్రత్యేకించి నీటికోసం గ్రామీణ ప్రాంతాలలోకి వస్తుంటాయని, అప్పుడు వీధికుక్కల బారినపడి గాయపడుతుంటాయన్నారు. వీటికి అడ్డుకట్ట వేసేలా తమవంతుగా తొట్టెలలో నీటిని నింపే ప్రక్రియ చేపట్టామని సంఘం సభ్యులు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమారస్వామి ఇతర బృందం సభ్యులు సహకారం అందిస్తున్నారన్నారు. 11 సంవత్సరాలుగా ఏటా వేసవిలో తొట్టెలలో నీరు సమకూరుస్తున్నట్టు తెలిపారు.

మహిళలకు 30 ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ



ఆటోలతో మహిళలు, నిర్వాహకులు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎస్‌బీసీ ఇండియా, కన్సర్న్ ఇండియా ఫౌండేషన్‌లు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్థికంగా వెనుకబడిన 30మంది మహిళలకు ఉపాధి కల్పించేలా ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేశారు. నగరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ సర్వీస్ సెంటర్ ముఖ్యూరాలు మమతా మదిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనలో వైవిధ్యం, సంప్రదాయాలను పాటించాలని భావించామన్నారు. ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని సమానతలు వేగం అనే థీమ్‌ను కొనసాగిస్తున్నామన్నారు. కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ కవితాషా మాట్లాడుతూ సమాజంలో ఉద్యోగాలు, ప్రయాణాలు అవసరమని అయితే పర్యావరణ రక్షణకు అనుకూలంగా ఉండడం అంతకంటే కీలకమన్నారు. అందుకే 30మంది మహిళలను ఎంపికచేసి వారికి శిక్షణలు ఇచ్చి ఎలక్ట్రికల్ ఆటో రిక్షాలను సమకూర్చామన్నారు. 30 కుటుంబాలు ఉపాధి పొందుతాయన్నారు.


దళితుల సంక్షేమంలో నిర్లక్ష్యం వద్దు



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ సుధాకర్ తదితరులు


చిక్కబళ్ళాపుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ఉద్దేశించిన నిధులను రెండేళ్లలో సుమారు 25వేల కోట్ల రూపాయలను సద్వి నియోగం చేయలేదని ఎంపీ కే సుధాకర్ ఆరోపించారు. చిక్క బళ్ళాపురలో గురువారం ఏర్పాటైన నిరసనలో ఆయన మాట్లా డుతూ షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించారన్నారు. తద్వారా దళితుల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలైన దళితుల ఉన్నతికోసం కేటా యించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కళాజాతా



ప్రదర్శన నిర్వహిస్తున్న కళాబృందం

కంప్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని ఎమ్మిగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్రకళా సంఘం అంబానగర్ సిరుగుప్ప జానపద కళాబృందం ఆధ్వర్యంలో కంప్లి తాలుకాలోని ఎమ్మిగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హళే నెల్లూడి గ్రామంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కే శోభాక్షేత్ర ఆరోగ్య విద్యాధికారులు పాటిస్తున్నారు. ఎం విగ్నేష్‌సీనియర్ హెల్త్ ఆఫీసర్లు ఎన్‌కే నంద ప్రాథమిక ఆరోగ్య అధికారులు హనుమంతప్ప కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎమ్మిగనూరు అన్నపూర్ణమ్మ, ఆశా కార్యకర్త, వీరేష్ దళావాయి నేత్ర కళాసంఘం అంబానగర్ సిరుగుప్ప కళాతండా, సంఘం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.25	1,586.02
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,909	1212
నీటి నిల్వ (టీఎంసీలు)	29.11	8.01



దెబ్బతిన్న టైర్

పేలిన బస్సు టైర్

● డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం

బళ్లారి గాంధీనగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్టీసీ బస్సు టైర్ పేలిపోయినా డ్రైవర్ అప్రమత్తంతో ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. గురువారం కొప్పళ నుంచి గంగావతికి వెళుతున్న కెఎస్ఆర్టీసి బస్సు ముందువైపు ఉన్న ఎడమ టైర్ బ్లాస్ట్ అయ్యింది. కేఏ 37-ఎఫ్0647 నెంబరు గల ఆర్టీసి బస్సు నగరం శివారు ప్రాంతమైన దాసవనాళ ప్రాంతంలో బస్సు ఎడమవైపు ఉన్న టైర్ బరెస్ట్ కావడంతో బస్సు అదుపుతప్పింది. అయితే బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సు వేగాన్ని తగ్గించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. ఈ ఘటనలో బస్సు సుమారు 100 మీటర్ల మేర రోడ్డును రాసుకుంటూ వెళ్ళి నిలిచి పోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 20మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సు వెనుక, ముందు వైపు ఎలాంటి వాహనాలు లేకపోవడంతో ప్రాణాలతో బతికి బయట పడ్డామని, సమయస్ఫూర్తితో అందరినీ కాపాడిన డ్రైవర్‌కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

వీధి పశువుల తరలింపు



పశువులను తరలిస్తున్న కార్మికులు

కంప్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి పశువుల్ని పురసభ అధికారులు దుర్గన్న గోశాలకు తరలించారు. గత కొన్ని రోజులుగా పట్టణంలో ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై అడ్డంగా వుంటూ వాహనదారులకు ఆటంకం కల్పిస్తుండంపై గురువారం అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అధికారి దుర్గన్న మాట్లాడుతూ తమ పశువుల్ని ఇళ్లలోనే కట్టు వేసుకుని పట్టణంలో వచ్చి వెళ్లే వారికి ఎలాంటి సమస్యలు కలగకుండా చూడాలని రైతులను కోరారు. పశువులను వదిలేస్తే గోశాలకు తరలిస్తామన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోండి

● విద్యార్థులకు జడ్పీ సీఈఓ మహమ్మద్ హారిస్ సూచన

బళ్లారి సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ సీఈఓ మహమ్మద్ హారిస్ సుమెర్ సూచించారు. గురువారం బాదరహట్టి కురుగోడు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బాదనహట్టి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరపు పదవతరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రీ-ఎగ్జామ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, పుష్కలంగా గ్రాంట్లు అందిస్తోందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పిల్లల్లో ఉపాధ్యాయులు నింపాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలోని ప్రతి బిడ్డను తమ సొంత బిడ్డలా చేసుకోవాలని, పిల్లల ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి, ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆశను బలాన్ని నింపడానికి కృషి చేస్తోందన్నారు. ఈసందర్భంగా పదవ తరగతి విద్యార్థులు తమ ఆందోళనలు, ఆకాంక్షలు, ఆందోళనల గురించి జిల్లాపంచాయితీత సీఈఓతో సంభాషించారు. ఈసందర్భంగా కురుగోడు ట్యాప్ నిర్వహక అధికారిణి నిర్మల, గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ డైరెక్టర్ శివరామరెడ్డి, తాలూకా ప్రణాళిక అధికారి రాధిక, పంచాయతీ రాజ్ అభివృద్ధి అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్, తాలూకాలోని అన్ని గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారులు, తాలూకా నరేగా, తాలూకా పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈఓ మహమ్మద్ హారిస్ సుమెర్

మిర్చి రైతుల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

బళ్లారి సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మిర్చికి కొనుగోలు కేంద్రాన్ని తెరచి మద్దతు ధర నిర్ణయించాలని బళ్లారి జిల్లా కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసిరేసేనా డిమాండ్ చేసింది. గురువారం బళ్లారి హవంబావి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి మాట్లాడుతూ బళ్లారి జిల్లాకు చెందిన ప్రముఖ ఎమ్మెల్యేలు రైతులకు అనుకూలంగా గొంతు విప్పి మిర్చికి మద్దతు ధర మంజూరు చేయించాలన్నారు. నాయకులు స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడ్తామన్నారు. తీవ్ర నష్టాలతో మిర్చి రైతు విలవిలలాడుతుంటే ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఈసందర్భంగా రైతు మోర్చా జిల్లాధ్యక్షుడు గణపాల ఐనాథ్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరప్ప, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం హసిరుసేన రాష్ట్ర సహకార కార్యదర్శి శంకర్, వెంకటేశ్‌రెడ్డి, రైతు నాయకులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



జీవనజ్యోతి అవార్డు అందుకుంటున్న రామప్ప

కంప్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని ఎమ్మిగనూరు గ్రామంలోని ప్రభుత్వ సెంటినరీ పాఠశాల అతిథి ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త ఎస్ రామప్పను జీవనజ్యోతి జాతీయ అవార్డుతో సత్కరించారు. బెంగళూరులోని డ్రీమ్ డిజిటల్ సొల్యూషన్, బెల్గామ్ అన్నపూర్ణేశ్వరి హ్యూమానిటీ అండ్ ఏకలవ్య ట్రస్టుల సహకారంతో బెంగళూరులోని కన్నడ భవన్‌లోని నయన రంగ మందిరలో జరిగిన కార్యక్రమంలో అతిథి ఉపాధ్యాయుడు ఎస్ రామప్ప 2025 జీవనజ్యోతి రాష్ట్రీక అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా చిత్రమేకప్ ఆర్టిస్ట్ యోగీష్, మహంతేష్ కాదల్గి, లావణ్య, మౌనేష్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై జేడీఎస్ నిరసన

రాయచూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఐదు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, జేడీఎస్ సీనియర్ నాయకుడు వెంకటరావ్ నాడగౌడ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరశిస్తు జేడీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి వెంకటరావ్ నాడగౌడ, అన్నభాగ్య, గృహజ్యోతి, గృహలక్ష్మి తదితర పథకాల అమలులో ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తిగా విఫలమైందన్నారు. ఏ ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా కేవలం మాటలతోనే కాలాయాపన చేస్తుండడం సిగ్గుచేటన్నారు. వివిధ పథకాలకు సంబంధించి నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల ఏ ఒక్క పథకం కూడా ప్రజలకు చేరడం లేదన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజ వెంకటప్ప నాయక్, జేడీఎస్ జిల్లాధ్యక్షుడు ఎం.విరుపాక్షి, జిల్లా కార్యధ్యక్షుడు ఎస్.శివశంకర్ అధ్యకేట్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిపతి తదితరులున్నారు.

బళ్లారిరూరల్, (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనహళ్లి తాయన్న నేతృత్వంలో నగరంలో నిరసన చేపట్టారు. సలే డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అసిస్టెంట్ కలెక్టర్ జుబేరాకు మనవిపత్రం అందించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, పుష్ప, మేఘరాజ్, రామకృష్ణ, రామాంజిని, భవానీ సబీనా, వన్నూరుస్వామి, నాగరాజు పలువురు జేడీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కలెక్టర్ జుబేరాకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



నిరాహార దీక్ష చేపట్టిన కార్పొరేషన్ సభ్యుడు గోవిందరాజులు

నిధుల కేటాయింపులో న్యాయం చేయాలి

● నిరాహార దీక్షలో కార్పొరేషన్ సభ్యుడు గోవిందరాజులు

బళ్లారి సిటీ,మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలైన మహాత్మాగాంధీ వికాస్ యోజన నిధులను పంపిణీ చేయడంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల వివక్షను నిరసిస్తూ కార్పొరేషన్ సభ్యుడు ఎం.గోవిందరాజులు నిరాహారదీక్ష చేపట్టారు. గురువారం తన వార్డు ప్రాంతంలోని ఇన్‌పాంట్రీ రోడ్డులో ఆయన దీక్ష ప్రారంభించారు. మున్సిపాలిటిలోని చాలామంది బీజేపీ సభ్యులు పార్టీ నాయకులు ఆయనకు మద్దతు పలికారు. బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్‌కు మహాత్మగాంధీ వికాష్ యోజన కింద రూ.127కోట్ల గ్రాంట్ లభించింది. ఇందులో కౌల్‌బజార్ ప్రాతానికి రూ.40కోట్లు విడుదలయ్యాయి. ఇందులో రూ.75లక్షలు 25,26, 27 వార్డుల పరిధిలోకి వచ్చే ప్రాజెక్టులకు కేటాయించారు. తమ వార్డు అభివృద్ధి కి ఎలాంటి డబ్బు ఇవ్వలేదని, ఇది తమ వార్డుకు తీరని అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తవకు రావాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ సభ్యుడు శ్రీనివాస్‌మోత్కార్, బుడా మాజీ అధ్యక్షుడు పాలన్న పాల్గొన్నారు.

జయంతులపై ముందస్తు సమావేశం

సిరుగుప్ప, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగనున్న మూడు జయంతులను ఘనంగా ఆచరించాలని డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ అధికారులకు సూచించారు. గురువారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో ముందస్తు సమావేశం నిర్వహించారు. 12వ తేదీ రేణుకా జయంతి, 14న యతీంద్ర కైవార తాత జయంతి, 28న బస్విరాయ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సిద్దార్థ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ జయంతులను ఆచరిస్తున్నట్లు తెలిపారు. ఆయా సమాజాలకు చెందిన వారు సహకారం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ సుబ్బయ్య, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా చైతన్య సదస్సు



పోస్టర్లు విడుదల చేస్తున్న రాష్ట్ర అత్యాచార వ్యతిరేక కూటమి సభ్యులు

బళ్లారి సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 11సంవత్సరాలుగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ప్రజా పోరాటంలో పొల్గొంటున్న కర్ణాటక రాష్ట్ర అత్యాచార వ్యతిరేక కూటమి 7, 8 తేదీల్లో నగరంలో మహిళా చైతన్య దినోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ కూటమి సభ్యురాలు ఆశాలత తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె ఆమాట్లాడుతూ.. సమానత్వం వైపు ప్రయాణం సహజీవనం గురించి రెండు సెమినార్లు, కవిత్వ పఠనం, హక్కుల ర్యాలీ, బహిరంగ సభ జరుగుతాయఅన్నారు. ఉదయం వెంకటేశ్వర కల్యాణ మంటపంలోని హరపనహళ్ళి భీమవ్వ వేదికపై మహిళల గౌరవం, బహుకోళాలు అనే అంశంపై ఒక సింపోజియం జరుగుతుంది, మైనింగ్, మానవ హక్కుల సమస్యలపై పనిచేసే హైదరాబాద్ నుంచి భానుమతి కల్లూరి కీలకోపన్యాసం చేస్తారు. బహిరంగ సభను భారత ముస్లిం మహిళా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న గుజరాత్‌కు చెందిన జాకియా సోమన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈసందర్భంగా యూనియన్‌కు చెందిన ఆస్మా, బి.వి. నాగవేణిసోసలే, నేత్ర తదితరులున్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

కంప్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మిస్తున్న తాలూకా పంచాయతీ కట్టడాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ సీఈవో మహమ్మద్ హరీష్ సమ్మేరు కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ శిక్షణ కేంద్రంలో తాలుకా పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన నూతన కట్టడాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యత పాటించాలని, ఇచ్చిన సమయంలోనే పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తాలుకా ఈఓ శ్రీకర్, ఏడీ మల్లన్నగౌడ, కాంట్రాక్టర్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ మహమ్మద్

బారికేడ్ల తొలగింపు

గంగావతి రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా కేంద్రానికి సమీపంలోని బల్డోటా కంపెనీ బసాపురా సరస్సుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లను దళితకార్యకర్తలు, నాయకులు గురువారం తొలగించారు. బసాపుర సరస్సు ప్రజలకు, పశువులకు ప్రయోజనకరంగా ఉంటుందని, కోర్టు ఆదేశాల మేరకు . దీనిని ప్రజలకే వదిలి వేయాలన్నారు. నాయకుడు మల్లికార్జున పూజార్ కంపెనీకి వెళ్లే ప్రదేశాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయడం తగదన్నారు. తక్షణమే ఆ కంపెనీ ఇక్కడి వెళ్ళిపోవాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



బారికేడ్లను తొలగిస్తున్న దృశ్యం

కన్నడ అభివృద్ధికి కట్టుబడాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాహితీవేత్తలు

రాయచూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కన్నడిగులు పరభాషల పట్ల ద్వేష భావానికి ఆస్కారం లేకుండా ఆత్మ విమర్శ చేసుకోవడం ద్వార భాషాభివృద్ధికి పాటు పడాలని ప్రముఖ సాహితీవేత్త నాడోజ చన్నబసప్ప సూచించారు. నగరంలోని పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరంలో గురువారం తాలూకా 6వ కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కన్నడ భాషకు 2వేల చరిత్ర ఉందని శతమానోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో భాష పట్ల అభిమానం పెరగడంతో పాటు సాహితీవేత్తల సంఖ్య కూడా ద్విగుణీకృతం కావడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. పదుల సంఖ్యలో ఉన్న కన్నడ సాహిత్య పరిషత్ వేలు, లక్షల సంఖ్యలో సభ్యులుగా పొందడం గర్వ కారణమన్నారు. బెంగళూరుకే పరిమితమైన కన్నడ సాహిత్య పరిషత్ జిల్లాలు తాలూకా స్థాయిల్లోకి విస్తరించడం భాషపట్ల కన్నడిగులకున్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ క్రమంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారులు భాషాభివృద్ధికి తమవంతు కృషి సాగించాలన్నారు. ప్రభుత్వాలు భాషాభివృద్ధికి ప్రోత్సహాన్నిచ్చి భాష రక్షణకు తోడ్పాటునందించాలన్నారు.

హోసూరు జోన్

తగ్గిన పూల ధరలు



హోసూరు మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా చామంతి పూలు

హోసూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండు ఎదురుగా ఉన్న పూలమార్కెట్‌లో పూల ధరలు తగ్గాయి. తిరువణ్ణామలై, వేలూరు, మదురై, సేలం, కృష్ణగిరి, అంచెట్టి, శూలగిరి, బాగలూరు, బేరికై, రాయకోటై, తళి, అత్తిబెలె, చందాపుర, ఆనేకల్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి 300 టన్ను పూలు వస్తున్నాయి. మేరిగోల్డ్, రోజా, జాస్మిన్, బటన్‌రోజా, వైట్‌రోజా, జెర్బారా తదితర రకాలు, గుండుమల్లి, సంపంగి, కనకాంబరం, వంటి వివిధ రకాల పూలను విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి కర్ణాటక, ఆంధ్ర సహ పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. కిలో చేమంతి రూ.60 నుంచి 80 వరకు, గులాబీ రూ.140 నుంచి రూ.160 వరకు, బంతిపూలు కిలో రూ.30, కనకాంబరం రూ.200 నుంచి రూ.300 వరకు, మల్లి రూ.200 నుంచి రూ.240 వరకు ధర పలికాయి. కొద్దిరోజులుగా ఎటువంటి పండుగలు లేకపోవడంతో పూల ధరలు తగ్గాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

హోసూరు రథోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

హోసూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హోసూరు చంద్ర చూడేశ్వర ఆలయం రథోత్సవం సందర్భంగా పల్లకీ ఉత్సవానికి ముస్తాబు చేస్తున్నారు. ఏటా నిర్వహించే రథోత్సవంలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. హోసూరు చుట్టుప్రాంతాల గ్రామస్థులకు అరుళ్మిగు మరగతాంబ, చంద్రచూడేశ్వర స్వామి కులదైవంగా ఉన్నారు. ఈనెల 13న ఉత్సవాలు ప్రారంభమై 27వ తేది వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం 14న రథోత్సవం, 15న రావణ ఉత్సవం, 16న తెప్పఉత్సవం జరగనుంది. రథాల నిర్మాణంలో భక్తులు, కళాకారులు కలిసి కట్టుగా పనులు నిర్వహిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ భక్తులు రానున్నారు.

సిద్ధమవుతున్న రథం





లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి చక్రపాణి

సంక్షేమాలతో పేదలకు న్యాయం: మంత్రి

హోసూరు(కృష్ణగిరి), మార్చి 6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, సాంఘిక సంక్షేమ, మహిళా హక్కుల శాఖ, వ్యవసాయ ఉద్యానవన శాఖల తరఫున 7,113 మంది లబ్ధిదారులకు రూ.5.78 కోట్ల విలువైన గ్రామీణాభివృద్ధి పథకాలను అమలు అవుతున్నాయని పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటైన కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, బర్గూరు ఎమ్మెల్యే మతియళగన్, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ దుకాణాలను ప్రారంభించారు. 7 ప్రాంతాలలో తాజాగా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. మంత్రి చక్రపాణి మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇంటింటికి వైద్యం, కరుణానిది కలల గృహనిర్మాణం, మహిళా హక్కుల పథకం, అంగన్‌వాడీ అల్పాహారం, ఇలా ఎన్నో పథకాలు అన్ని వర్గాల వారికి ప్రయోజనం కల్పిస్తున్నాయన్నారు. ఇంత వరకు 8 లక్షల గృహ నిర్మాణం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అలాగే రూ.49.21 లక్షల విలువైన 493 ఇళ్లు, 4 గోశాలలు ఇతరత్రా నిధులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురల్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, వ్యవసాయ శాఖ అసోసియేట్ డైరెక్టర్ పచ్చయ్యప్పన్, అసోసియేట్ డైరెక్టర్ ప్రస్తుతం రాణి, సహకార సంఘాల కుమార్, దివ్యాంగ సంక్షేమాధికారి మురుగేశన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి శక్తి సుభాషిణి, జిల్లా కమిషనర్లు వళర్మతి, మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

హోసూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన ఒన్నల్‌వాడి పంచాయతీ పరిధి కారపల్లిలోని పాఠశాల వార్షికోత్సవం, క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. తమిళనాడు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు రంగురంగుల కళా ప్రదర్శనలు అలరించాయి. పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సాహించేందుకు సాంస్కృతిక కళాప్రదర్శనలు, జానపదాలు, పల్లెటూరు కళారూపాలను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు హేమావతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా టీ.టీ. రాజు, సూపర్‌వైజర్ కుమారవేల్, సెందిల్‌కుమార్, ఒన్నల్‌వాడీ పంచాయతీ యూనియన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ యోగనాథ్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వాసుదేవమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు